

**ఓబుళాపురం గనులపై సీఎస్ రమాకాంతరెడ్డికి వినతిపత్రం అందజేసి వస్తున్న తెదేపా నాయకులు**

# రాష్ట్రానికి 'గాలి' సోకింది

## జగన్ కనుసన్నల్లో పాలన: తెదేపా

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి రోశయ్య వ్యవహారశైలిని చూస్తుంటే రాష్ట్రాన్ని గాలి జనార్ధన్‌రెడ్డి, వైఎస్ జగన్ నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోందని తెదేపా ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించారు. రోశయ్య తన పదవిని కాపాడుకుంటున్నారే తప్ప రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడటం లేదని విమర్శించారు. ఓబుళాపురం గనుల కుంభకోణంలో పాలుపంచుకున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని, త్రిసభ్య కమిటీ నివేదికను వెల్లడించాలని కోరుతూ గురువారమిక్కడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి. రమాకాంతరెడ్డికి మోత్కుపల్లి నర్సింహులు, ఎర్రబెల్లి దయాకరరావుల నేతృత్వంలో తెదేపా ఎమ్మెల్యేలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. త్రిసభ్య కమిటీ నివేదికను వెంటనే ప్రజల ముందు పెట్టాలని కోరారు. గాలి జనార్దన్‌రెడ్డి అక్రమాలపై ప్రభుత్వం సరిగా స్పందించడం లేదని ఆరోపించారు. గాలి జనార్దన్‌రెడ్డికి ముఖ్యమంత్రి భయపడుతున్నారని ఆరోపించారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పుడు సర్కారు వెంటనే ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు. త్రిసభ్య కమిటీ నివేదిక కాపీ గాలి జనార్దన్‌రెడ్డికి అందిందని, ప్రతిపక్షాలకు, ప్రజలకు అందలేదని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శివద్ద లేని ఈ ఫైలు గాలి వద్ద ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని వివరించారు. అక్రమాలకు సహకరించిన ప్రస్తుత, మాజీ గనులు, అటవీశాఖ మంత్రులను వెంటనే తొలగించి రోశయ్య చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు.